క్లుప్తంగా

కొల్లేరు సంతోషిమాత ఆలయంలో రాఖీ పౌర్ణమి

ఏలూరు రూరల్: రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం కొల్లేరు గ్రామం మొండికోడులో సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు పరివేక్షణంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల కోసం టెంట్లు, తాగునీరు తదితర సౌకర్యాలు సిద్ధం చేశారు. ఏటా కొల్లేరు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో శ్రీసంతోషిమాతను దర్శించుకుంటారు. అమ్మవారి సమక్షంలో చెల్లెల్లు, అక్కలు అన్నదమ్ములకు రాఖీలు కడతారు. భక్తుల కోసం గ్రామస్తులు అన్నదానం నిర్వహిస్తారు.

వాకర్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఏలూరు రూరల్ : స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏఎస్ఆర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్, వాసవి సుబ్బారావు, సీతారాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరానికి డాక్టర్ నంబూరి రాఘవరామ్ తన వైద్య సిబ్బందితో కలిసి సేవలందించారు. పలువురు వాకర్స్‌కు బీపీ, సుగర్, గుండె తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం అక్బర్, జగదీష్, ప్రత్తిపాటి నాగవిగ్నేష్, ఎల్ఎన్ జగదీష్, జంపా సూర్యనారాయణ, విశ్వనాథ్, మాధవరావు, ఎస్కే లాల్‌సాహెబ్, జీపీ గుప్తా పాల్గొన్నారు.

ఫైళ్ల దహనం ఘటనలపై సమగ్ర విచారణ చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పోలవరం ప్రాజెక్ట్ పరిపాలన కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి కోరారు. ఇటీవల కాలంలో ఫైల్స్ దగ్ధం వార్తలు తరచూ వినిపిస్తున్నాయని, వాటిలో వాస్తవాలేమిటనేది ప్రభుత్వం తేల్చాలని పేర్కొన్నారు.

మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తేవాలి

ఏలూరు(మెట్రో): కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ దారుణ హత్యను ఉమ్మడి పశ్చిమగోదావరి ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్, మహిళా విభాగం ఆదివారం తీవ్రంగా ఖండించింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళల కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో మహిళలు, టీనేజీకి వచ్చిన బాలికలు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు, గంజాయికి బానిసలు కాకుండా మగ పిల్లలకు తల్లిదండ్రులు కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, మహిళా విభాగం సభ్యులు కె.నాగమణి, డి.నాగదేవి, టి.కుసుమ కుమారి, కె.సునీత, ఈ.సత్యభారతి తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్‌లో ఆటలు.. ఛిద్రమవుతున్న జీవితాలు

- బానిసవుతున్న చిన్నారులు, యువత
- మోసాల బారిన పడి మానసిక ఆందోళన
- అనారోగ్యం, ఆర్థికంగా నష్టాల పాలవుతున్న వైనం



ఆన్‌లైన్‌లో యువత, చిన్నారులను ఆకర్షిస్తున్న కొన్ని గేమింగ్ యాప్‌లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆటలు మనసుకు ఉల్లాసాన్నిస్తాయి. శరీరానికి ఆరోగ్యాన్నిస్తాయి. చిన్న వయసు వారి నుంచి పెద్దల వరకూ ఆటలంటే ప్రాణం పెడుతూ ఉంటారు. చదువుకునే వయసు నుంచి ఆటలాడుతూ పెరిగి పెద్ద వయసు వచ్చిన వారు ఆటలు ఆడలేకపోయినా ఇతరులు ఆడుతుంటే చూసి ఆస్వాదిస్తూ ఉంటారు. అందుకే ఇప్పటికీ టీవీల్లో క్రీడా చానళ్లకు విపరీతమైన రేటింగ్ వస్తోంది. క్రికెట్, ఫుట్‌బాల్, టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, హాకీ వంటి క్రీడా పోటీలు జరుగుతుంటే టీవీలకు అతుక్కుపోతూ ఉంటారు. ఇక ఒలింపిక్స్ క్రీడలకైతే చెప్పలేని క్రేజ్ ఉంటుందనే విషయం ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్ క్రీడల సందర్భంగా నిరూపితమైంది. మారుతున్న సామాజిక పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం విద్యాభ్యాసం చేసే చిన్నారులకు శారీరకంగా అలసిపోయే ఆటలు ఆడే అవకాశమే దక్కడం లేదు. నేటి విద్యార్థులు చదువుకునే విద్యా సంస్థల్లో అసలు క్రీడా ప్రాంగణాలే కరువైపోతున్నాయి. క్రీడలపై ఆసక్తి కలిగిన కేవలం 10–15 శాతం మంది తల్లిదండ్రులు తప్పితే చాలామంది తమ పిల్లలు ఆటలకు వెళతామంటే అంగీకరించే పరిస్థితే కనిపించడం లేదు.

ఆన్‌లైన్ గేమ్ యాప్‌లు నెట్టింట్లో హల్‌చల్

పరస్తుత పరిస్థితుల్లో శారీరకంగా శ్రమించే ఆటలు ఆడే అవకాశం లేకపోవడంతో విద్యార్థులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఆటలు ఆడడానికి ఆసక్తి చూపుతున్నారు. పెరిగిన టెక్నాలజీ కారణంగా ప్రతి ఒక్కరి చేతిలోకి ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. బ్యాంకింగ్, ఆన్‌లైన్ షాపింగ్, వివిధ రకాల పన్నుల చెల్లింపులు వంటి అన్ని రకాల సేవలను ఫోన్లో నిర్వహిస్తున్నాం. ప్లేస్టోర్ నుంచి ఆయా రకాల యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకుని సేవలను వినియోగించుకుంటున్నాం. ఈ క్రమంలోనే కొన్ని రకాల ఆన్‌లైన్ గేమ్ యాప్‌లు నెట్టింట్లో అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్‌ల్లో క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడలకు సంబంధించిన యాప్‌లతో పాటు పేకాట, గుండాట, హార్స్ రేసింగ్ వంటి జూద క్రీడలూ దర్శనమిస్తున్నాయి. పబ్‌జీ తరహాలో వచ్చిన స్నైపర్ అటాక్, ఫ్రీ ఫైర్, కవర్ ఫైర్, మోడ్రన్ స్ట్రైక్, గ్రాండ్ బ్యాటిల్ రాయల్ వంటి ఆటల్లో చిన్నారులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఆటల్లో మునిగి తేలుతున్నారు.

సొమ్ము పోగొట్టుకుంటున్నారు

కొన్ని ఆన్‌లైన్ గేములు డౌన్‌లోడ్ చేసుకుని ఆడుకునే అవకాశం ఉండగా మరికొన్ని గేమ్‌లు ఆన్‌లైన్‌లోనే ఆడాల్సి వస్తోంది. ఆన్‌లైన్‌లో ఆడే గేముల్లో విజేతలుగా నిలిస్తే డబ్బులు కూడా వస్తున్నాయి. దీనితో చాలా మంది ఆన్‌లైన్‌లో డబ్బులకు ఆడడం మొదలు పెడుతున్నారు. ఐతే ఆన్‌లైన్‌లో ఆటలు ఆడి సొమ్ములు గెలుచుకున్న వారు వేళ్లపై లెక్కించేంత మంది మాత్రమే ఉంటుండగా, సొమ్ములు పోగొట్టుకున్న వారే అధిక శాతం మంది ఉంటున్నారు. ఆన్‌లైన్ గేములతో సులువుగా డబ్బు సంపాదించవచ్చనే ప్రకటనలు ఇబ్బడి ముబ్బడిగా వస్తుండడంతో బాలలు, యువత వాటికి ఆకర్షితులవుతూ డబ్బులు పోగొట్టుకునే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. యాప్ ఇన్‌స్టాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకుంటే బోనస్ పాయింట్లు, ప్రైజ్ మనీ అందిస్తున్నారు. దీంతో యువత ఆయా బోనస్ పాయింట్లతో ఆడడం మొదలు పెట్టి, చివరికి బ్యాంక్, యూపీఐల ద్వారా సొంత డబ్బును చెల్లించి మోసాల బారిన పడుతున్నారు. వీరితో పాటు చిన్నారులు ఆడుకునే కొన్నిరకాల స్నైపర్ గేమ్స్‌లోనూ సొమ్ములు స్వాహా అయిన ఘటనలు వెలుగులోకి రావడంతో తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. ఆన్‌లైన్ గేములు అధిక సమయం ఆడుతున్న చిన్నారులు చదవడం, తినడం మానేసి నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారు. చదువులో వెనుకబాటు, ఏ పని పైనా ఏకాగ్రత చూపలేకపోవడం, వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటితో పాటు విపరీతమైన ఒత్తిడి కారణంగా మానసిక సమస్యలు కూడా వెంటాడుతున్నాయి. యువతలో కొంతమంది సొమ్ములు పోగొట్టుకుని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

యువత స్వీయ నియంత్రణ పాటించాలి



ఆన్‌లైన్ గేముల జోలికి వెళ్లకుండా యువత స్వీయ నియంత్రణ పాటించాల్సిన అవసరం ఉంది. చిన్నారులు మొబైల్ వినియోగించే సమయంలో తల్లిదండ్రులు వారిపై దృష్టిసారించి వారు ఏమి చూస్తున్నారు అనే విషయాన్ని గమనించాలి. సెల్‌ఫోన్ ఎక్కువగా చూసేవారికి ఒత్తిడి, కోపం, డిప్రెషన్ వంటి మానసిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. కొన్ని ఆన్‌లైన్ గేమ్స్ కారణంగా పిల్లల్లో హింసాత్మక ధోరణి పెరిగే ప్రమాదముంది. పిల్లలు చెడును తొందరగా ఆకళింపు చేసుకుంటారు. యాప్‌ల కారణంగా మెదడుకు పనిచెప్పే అవసరం లేకుండా పోతోంది. దీంతో మెదడుకు ఆలోచించే శక్తి తగ్గిపోతుంది. పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆన్‌లైన్ గేముల వల్ల కలిగే అనర్థాలపై అప్రమత్తం చేయాలి.

– అక్కింశెట్టి రాంబాబు, సైకాలజిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు

ఇస్కాన్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఈ నెల 26న అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఏలూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో నిర్వహించిన వివిధ పోటీల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకూ చిత్రలేఖన పోటీలు, ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకూ వ్యాస రచన పోటీలు నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఇస్కాన్ ఏలూరు శాఖ ప్రతినిధి రాధా వల్లభ దాస్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారిలో విజేతలను ఈ నెల 26న ప్రకటించి, అదే రోజు నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో సర్టిఫికెట్లు, జ్ఞాపికలు, బహుమతులు అందజేస్తామన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

ఏలూరు టౌన్: ఏలూరు శనివారపుపేట ప్రాంతానికి చెందిన ఒక విద్యార్థినిని ప్రేమించాలంటూ వేధింపులకు పాల్పడుతున్న యువకుడిపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. శనివారపుపేట ప్రాంతానికి చెందిన పదవ తరగతి విద్యార్థినిని లంకపల్లి విష్ణు అనే యువకుడు ప్రేమించాలంటూ వేధిస్తూ ఉండడంతో బాధిత బాలిక తల్లి ఫిర్యాదుతో ఏలూరు త్రీటౌన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రూరమృగాళ్లను కఠినంగా శిక్షించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిని దారుణ హత్యను ఖండిస్తూ నగరంలో నిరసనలు వెల్లువెత్తాయి. ఆదివారం రాత్రి స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పీ.హైమావతి, ఏ.శ్యామలరాణి మాట్లాడుతూ కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యంత కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, పోలీసులు ముద్దాయిలకు రక్షణ కల్పించి అత్యాచారాన్ని తప్పు దారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆ క్రూరమృగాలను వెంటనే శిక్షించాలని ఐద్వా, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ఈకార్యక్రమంలో ఐద్వా నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం, వివిధ ప్రజా సంఘాల నాయకులు, యూటీఎఫ్ జిల్లా పూర్వ కార్యదర్శి పీవీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

పీజీ వైద్య విద్యార్థి హత్య ఆటవిక చర్య

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్య అనాగరిక, ఆటవిక, పాశవిక చర్య అని, తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్ పొలిమేర హరికృష్ణ అన్నారు. స్థానిక గన్ బజార్ 44వ డివిజన్లో హరికృష్ణ ఏర్పాటు చేసిన మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జూనియర్ డాక్టర్ చిత్రపటం వద్ద హరికృష్ణ, మహిళలు క్యాండిల్స్ వెలిగించి నివాళులర్పించారు. కను మూరి కుమారి, పలువురు మహిళలు పాల్గొని క్యాండిల్స్ వెలిగించి నివాళులర్పించారు. నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికే వరప్రసాద రావు మాట్లాడుతూ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా వైవీ రమణ నియమితులయ్యారు. ఆయన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం సీఐగా పనిచేస్తున్న ఎం.ప్రభాకర్‌ను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. 1996 ఎస్సై బ్యాచ్‌కు చెందిన రమణ 2010లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. సీఐగా పదోన్నతి పొందిన అనంతరం తొలుత ఏలూరు ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వర్తించారు. ఏలూరులో ఇంటిలిజెన్స్ సీఐగానూ బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరం సీఐడీ విభాగంలో పనిచేశారు. ప్రస్తుతం ఆయన మచిలీపట్నం ట్రాఫిక్‌లో పనిచేస్తుండగా సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు టూటౌన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ వైవీ రమణ మాట్లాడుతూ నగరంలో శాంతిభద్రత పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యమన్నారు. నేరాలను నిరోధించేందుకు నేరాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా మరింత పెంచుతామని చెప్పారు. మహిళలపై నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని, బాధితులు నేరుగా తనకు ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు. సీఐ వైవీ రమణకు ఏలూరు టూటౌన్ ఎస్సైలు మదీనాబాషా, సాధిక్, రవితేజ, పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ రమణ ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ రామకోటి వద్ద మహిళపై అత్యాచారయత్నం ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం ఏలూరు జీజీహెచ్‌లో బాధిత మహిళను సీపీఎం నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు లేక ఒక కుటుంబం కొద్ది రోజులుగా ధర్మాజీగూడెం నుంచి వచ్చి ఏలూరులో రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. అర్ధరాత్రి వేళ మద్యం మత్తులో ముగ్గురు యువకులు భర్తపై దాడి చేసి, భార్యపై అత్యాచారానికి పాల్పడ్డారని అన్నారు. ఏలూరులో జరిగిన ఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో రోజురోజుకూ మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కొత్త చట్టాలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నా మహిళలపై ఇలాంటి దారుణమైన దాడులు ఆపలేకపోవటం సిగ్గుచేటన్నారు. శుక్రవారం రాత్రి జరిగిన ఘటనలో ఒక వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేస్తే పనిచేయకపోవటం, స్టేషన్‌కు వెళ్లి సమాచారం ఇచ్చినా వెంటనే పోలీసులు స్పందించలేదనే వార్తలు వచ్చాయని దానిపై ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర నాయకులు బీ.జగన్నాథరావు, కే.రామాంజనేయులు, వీవీఎస్ ప్రసాద్ ఉన్నారు.

135 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లయన్స్ క్లబ్ ఏలూరు విజన్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 135 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో 12 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి వారికి శస్త్రచికిత్సలు చేయడానికి వేమగిరిలోని ఆసుపత్రికి తరలించారు. మరో 26 మందికి కళ్లజోళ్లను సబ్సిడీ ధరలకు అందజేశారు. అవసరమైన వారికి ఐ డ్రాప్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు మల్లవల్లి చలపతిరావు, కంది బాలకృష్ణ, పీ. లక్ష్మీనారాయణ, టీవీ సుబ్బారావు, టీపీకే మోహన రావు, పిల్లి పండరీనాథ్, బొలిశెట్టి సురేష్ కుమార్, చెన్నా వెంకట రామయ్య, కె.విఠల్ పాల్గొన్నారు.



శిబిరంలో నేత్రవైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : రాట్నాలమ్మ అమ్మవారికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రత్యేక పూజలు చేసి మొక్కు లు తీర్చుకున్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం అమ్మవారికి ప్రీతికరమైన రోజుకావడంతో జిల్లా నలుమూలల నుంచి అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల ద్వారా రూ.36,560, విరాళాలు రూ.35,287, లడ్డూ ప్రసాదంపై రూ.18,720, ఫొటోల విక్రయంతో రూ.4,135, మొత్తం రూ.94,702 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్‌కుమార్ చెప్పారు. రాట్నాలమ్మ అమ్మవారికి విరాళాలు వెల్లువెత్తాయి. ఆదివారం పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన పామర్తి సీతారామయ్య, నాగేంద్రమ్మ దంపతులు, లక్ష్మీదుర్గ, సాయి మేఘనలు రాట్నాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.31,000 విరాళంగా అందించారు.



ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ తల్లి

ఉత్తమ అవార్డుకు ఎంపిక

దెందులూరు: ఏలూరు జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరంలో రాష్ట్ర, జిల్లాస్థాయిలో నిర్వహించిన క్రీడాపోటీల్లో పాల్గొని పతకాలు సాధించడంతో పాటు ఇతర అంశాల్లో ప్రగతి ఆధారంగా దెందులూరు నియోజకర్గం పరిధిలో మూడు పాఠశాలలను ఉత్తమ అవార్డుకు ఎంపిక చేశామని డీఈవో డి. అబ్రహం తెలిపారు. పెదవేగిలో ఏపీడబ్ల్యూఎస్ఆర్ఎస్, ఏలూరు రూరల్ మండలం పోణంగి, పెదపాడు మండలం కలపర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు హర్షం వ్యక్తం చేశారు.

డాక్టర్ చార్లెస్‌కు ఘన సత్కారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తెలుగు రాష్ట్ర ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను విదేశీయులకు తెలపడం కోసం 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా 15 మంది ఉపాధ్యాయులను అమెరికా పంపింది. వారిలో నగరానికి చెందిన డాక్టర్ చార్లెస్ అక్కడ విధులు ముగించుకుని ఆదివారం నగరానికి వచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి డాక్టర్ చార్లెస్‌ను దుశ్శాలువాతో సత్కరించారు.

హైకోర్టు ఏజీపీకి ఘన సత్కారం

దెందులూరు: దెందులూరు గ్రామానికి చెందిన గంజి వెంకట్రావు, సువర్ణలాదేవి కుమారుడు నీలోత్పల్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఏజీపీగా నియమితులు కావడం దెందులూరు గ్రామ, మండలానికి స్ఫూర్తిదాయకమని నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. ఆదివారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో ఏజీపీకి పౌరసన్మానం చేశారు. రెండవ వార్డు నుంచి ఘనంగా ఆయనకు స్వాగతం పలికారు. నేటి యువత నీలోత్పల్‌ను ఆదర్శంగా తీసుకుని ఎంచుకున్న రంగాల్లో లక్ష్యాలు సాధించాలన్నారు. నూతన ఏజీపీ మాట్లాడుతూ తాను ఈ రోజు రాష్ట్ర హైకోర్టుకు ఏజీపీగా నియామకం పొందడానికి తన తల్లిదండ్రుల కృషి, ప్రోత్సాహం, సహకారం ప్రధాన కారణమన్నారు. దెందులూరు తరఫున పౌర సన్మానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొడాలి ఆంజనేయచౌదరి, మొటపర్తి రాజా, దేవినేని తులసీదాసు, మేడిది నికోలా, మద్దిపాటి వెంకట్రాది, సంపంగి వేణుగోపాల్ తిలక్ పాల్గొన్నారు.



దెందులూరు నర్సింగ్ కళాశాలలో హైకోర్టు ఏజీపీగా ఎంపికైన గంజి నీలోత్పల్‌కు పౌర సన్మానం చేస్తున్న దృశ్యం

కంటి వ్యాధులపై నిర్లక్ష్యం తగదు

గణపవరం: కంటి సమస్యలను చాలామంది ఎక్కువగా నిర్లక్ష్యం చేస్తారని, ఇది చాలా ప్రమాదకరమని ప్రముఖ కంటి శస్త్రచికిత్సా నిపుణుడు యూజే రాజు అన్నారు. ఆదివారం గణపవరంలో మీనాక్షి కంటి వైద్యశాల, గణపవరం పీఎంపీ అసోసియేషన్, గణపవరం మెడికల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో కంటి సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. కంటికి గాయాలయితే వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలన్నారు. పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్కే పరమేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించడం అభినందనీయమని అన్నారు. వైద్యసేవలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. మెడికల్ యూనియన్ అధ్యక్షుడు సుబ్బరాజు మాట్లాడుతూ కంటి సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యావేత్త సీహెచ్ నాగేశ్వరరావు, మానవత జిల్లా నాయకుడు పుప్పాల గోపి, బుద్దారపు పుల్లయ్య, లయన్స్‌క్లబ్ సభ్యులు వెల్లంకినరేష్, కిలారి రవి, పోశింశెట్టి రామ్మూర్తి, పీఎంపీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేత్రవైద్య నిపుణుడు రాజు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	48	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	7,10
బెండకాయలు	24	కంద	50
పచ్చిమిర్చి	38	బీట్‌రూట్	36
కాకర కాయలు	30–36	కీరా దోస	46
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	64
బీరకాయలు (పందిరి)	40	అల్లం	100–160
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36–56	పాలకూర	10
దొండకాయలు	40	చుక్కకూర	10
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	42–44	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	24–26	బఠాణి	--
ఆనబకాయ (1)	10–15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	01
ఏలూరు - బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	20.15	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	01
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	00
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	01
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	02
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	01
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	29
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.50	98509	15
ఏలూరు - తిరుపతి	16.00	4830	36